## క్లుప్తంగా

### డిప్యూటీ ఎంపీడీఓగా బ్రహ్మానందానికి పదోన్నతి



కరప: యండమూరు పంచాయతీలో గ్రేడ్-1 కార్యదర్శిగా పని చేస్తున్న పీఎస్ఆర్ బ్రహ్మనందానికి డిప్యూటీ ఎంపీడీఓగా పదోన్నతి లభించింది. ఈయన 1991లో బిక్కవోలు మండలం ఆరికిరేవుల పంచాయతీలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగంలో చేరారు. తర్వాత 2006లో గ్రేడ్-2 పంచాయతీ కార్యదర్శిగా పదోన్నతి పొందారు. తర్వాత 2010లో గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శిగా పదోన్నతి వచ్చింది. వివిధ పంచాయతీల్లో గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తూ గతేడాది అక్టోబర్ నాలుగున యండమూరు పంచాయతీలో గ్రేడ్-1 కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. డిప్యూటీ ఎంపీడీఓగా ముమ్మిడివరం మండలం కేటాయించినట్టు బ్రహ్మానందం శుక్రవారం విలేకర్లకు తెలిపారు.

### కన్నబాబుకు సత్కారం



కురసాల కన్నబాబును సత్కరిస్తున్న కాదా వెంకటేశ్వరరావు

కాకినాడ రూరల్: వైఎస్సార్ సీపీ కాకినాడ రూరల్ నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడిగా నియమితులైన కరప మండలానికి చెందిన కాదా వెంకటేశ్వరరావు శుక్రవారం పార్టీ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ కురసాల కన్నబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. రమణయ్యపేట వైద్యనగర్ క్యాంప్ కార్యాలయంలో కన్నబాబును కలిసి తనను బీసీ సెల్ రూరల్ నియోజకవర్గానికి అధ్యక్షుడిగా నియమించినందుకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం శాలువాతో కన్నబాబును సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, పార్టీ మండల అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### ఉద్యోగుల పీజీఆర్ఎస్‌కు 13 అర్జీలు



ఉద్యోగుల సమస్యలు వింటున్న హౌసింగ్ పీడీ సత్యనారాయణ

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): కలెక్టరేట్‌లోని వివేకానంద హాల్‌లో శుక్రవారం ఉద్యోగుల ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. హౌసింగ్ పీడీ ఎన్వీవీ సత్యనారాయణ ఉద్యోగుల నుంచి వినతులు స్వీకరించారు. ఇందులో వివిధ సమస్యలపై 13 అర్జీలు అందాయని ఆయన తెలిపారు. ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. జిల్లాలోని ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రతి నెలా మూడో శనివారం ఉద్యోగుల ప్రత్యేక గ్రీవెన్స్ జరుగుతుందని చెప్పారు.

### వసతి గృహాల పరిశీలన



బాలికల గురుకుల వంట గదిని పరిశీలిస్తున్న అధికారులు

బోట్‌క్లబ్: నగరంలోని సాంబమూర్తినగర్‌లో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల రెసిడెన్షియల్ పాఠశాలను కార్పొరేషన్ అధికారుల బృందం శుక్రవారం పరిశీలించింది. ప్రత్యేకాధికారి కేటీ సుధాకర్, అర్బన్ తహసీల్దార్ జితేంద్ర, హెల్త్ ఆఫీసర్ పృథ్వీచరణ్, శానిటేషన్ సూపర్‌వైజర్ రాంబాబు ఈ బృందంలో ఉన్నారు. వంట గది, స్టోర్ రూం, బాత్రూమ్‌లు, ఆవరణ పరిశుభ్రత తదితర అంశాలను పరిశీలించారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమమస్యలను పాఠశాల ప్రిన్సిపాల్ సత్యవతి అధికారులకు వివరించారు. ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లు, శ్లాబ్ లీకేజీ వంటి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం విద్యార్థులతో కలిసి అధికారులు సహపంక్తి భోజనం చేసి, వారి సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ, కలెక్టర్ ఆదేశాల మేరకు వసతి గృహాల పరిస్థితులను పరిశీలించి, సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటారని తెలిపారు.

### ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ విజయశేఖర్

కాకినాడ క్రైం: రంగరాయ వైద్య కళాశాల(ఆర్ఎంసీ) వైస్ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ విజయశేఖర్‌ను నియమిస్తూ ప్రిన్సిపాల్ డాక్టర్ అత్తలూరి విష్ణువర్ధన్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ స్థానంలో పనిచేసిన డాక్టర్ ఉమామహేశ్వరరావు ఫోరెన్సిక్ హెచ్‌వోడీగా కొనసాగనున్నారు.

# అణచివేతపై గళకలం




బోట్‌క్లబ్: అణచివేతకు గురవుతున్న కలం గళమెత్తింది. అడ్డూ అదుపూ లేని పోలీసుల చర్యలపై నిరసన స్వరం వినిపించింది. 'సాక్షి' కార్యాలయానికి పోలీసులు రావడం చట్ట విరుద్ధమైన చర్య అని కాకినాడ పాత్రికేయులు మండిపడ్డారు. సాక్షి పత్రిక కార్యాలయానికి వచ్చి ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డికి నోటీసులివ్వడం, అక్రమ కేసులు బనాయించడం, అర్ధరాత్రి వరకూ హడావుడి చేయడం సరికాదన్నారు. కాకినాడ కలెక్టర్ కార్యాలయం వద్ద శుక్రవారం కాకినాడలోని పలు సంఘాలకు చెందిన పాత్రికేయ ప్రతినిధులు ధర్నా చేసి, కలెక్టరేట్ ఆవరణలో ఉన్న గాంధీ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఏవో రామ్మోహనరావుకు వినతి పత్రం ఇచ్చారు. ప్రజల తరఫున పోరాడుతున్న 'సాక్షి' గొంతు నొక్కడానికి కూటమి ప్రభుత్వం మరోసారి పోలీసులను ప్రయోగించిందని మండిపడ్డారు. తప్పుడు కేసులు బనాయించడం సిగ్గు చేటన్నారు. కార్యక్రమంలో పాత్రికేయ ప్రతినిధులు దొరబాబు, లక్ష్మీపతిరావు, రవికిరణ్‌రెడ్డి, ప్రభాకర్, కొమ్మిరెడ్డి శ్రీధర్, సుధీర్, తలాటం సత్యనారాయణ, దొమ్మేటి నాగరాజు, ముమ్మిడి చిన్న, సురేష్, చంటి, వినయ్ పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఏవో రామ్మోహన్‌కు వినతిపత్రం ఇస్తున్న పాత్రికేయులు

## లేజర్ చికిత్సతో బహుళ ప్రయోజనాలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ శ్రీరామ్

బోట్‌క్లబ్: అధునాతన లేజర్ చికిత్స విధానం ద్వారా కంటి వ్యాధితో బాధపడుతున్న రోగులకు ఎంతో మేలు చేయడానికి వీలుంటుందని నయన కంటి ఆసుపత్రి అధినేత డాక్టర్ రావుల శ్రీరామ్ అన్నారు. రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్ సమావేశం శుక్రవారం రాత్రి స్థానిక రోటరీ క్లబ్‌లో క్లబ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపీనాథ్ అధ్యక్షతన జరిగింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కంటి వైద్యుల అసోసియేషన్ అధ్యక్షులుగా ఎన్నికై, ఇటీవల ఉత్తమ సేవా పురస్కారాన్ని అందుకున్న సందర్భంగా శ్రీరామ్‌ను రోటరీ పూర్వ గవర్నర్ డాక్టర్ ఎస్వీఎస్ రావు, అసిస్టెంట్ గవర్నర్ అప్పసాని కృష్ణకుమారి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీరామ్ మాట్లాడుతూ, కంటి వైద్య చికిత్స రంగంలో అనేక మార్పులు వచ్చాయన్నారు. అత్యాధునిక వైద్య పరిజ్ఞానంతో కంటి శస్త్ర చికిత్సలు విజయవంతంగా నిర్వహించడమే కాక, రోగులకు ఎంతో మేలు జరుగుతోందని చెప్పారు. కంటి వ్యాధిపై అశ్రద్ధ ఉండరాదని, సకాలంలో వైద్యులను సంప్రదించడం ద్వారా కంటిచూపును కాపాడుకోవాలని సూచించారు. ప్రస్తుతం వాతావరణ కాలుష్యంతో పాటు, ఆహారపు అలవాట్లు కూడా కంటి వ్యాధులు రావడానికి ఆస్కారమిస్తున్నాయని వివరించారు. చిన్నతనం నుంచే కంటిపై శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ గోపీనాథ్ మాట్లాడుతూ, సుమారు లక్ష కంటి ఆపరేషన్లను డాక్టర్ శ్రీరామ్ విజయవంతంగా నిర్వహించారన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి డాక్టర్ సానా ప్రవీణ్, కోశాధికారి ఉదయ చక్రవర్తి పాల్గొన్నారు.

## స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి

బోట్‌క్లబ్: నగరంలోని పీఆర్ కాలేజీ వద్ద స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని టౌన్‌హాల్ కమిటీ సభ్యులు, కాకినాడ ప్రింటర్స్ అసోసియేషన్ ప్రతినిధి దంగేటి ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్టీసీ బస్సులతో పాటు, ఇతర వాహనదారులు కూడా వేగంగా ప్రయాణించడం వల్ల విద్యార్థులు, పాదచారులు ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. ఉదయం సుమారు 500 మంది పీఆర్ కళాశాలకు వాకింగ్ వస్తున్నారన్నారు. నిత్యం ఈ రహదారి రద్దీగా ఉండడంతో నిత్యం ప్రమాదం సర్వసాధారణంగా మారిందన్నారు. కార్పొరేషన్, ఆర్అండ్‌బీ అధికారులు స్పీడ్‌బ్రేకర్లు ఏర్పాటు చేయాలన్నారు.

# సర్వీస్ ఏదీ..?

- రామారావుపేట-కొండయ్యపాలెం ఫ్లైఓవర్‌కు సర్వీస్ రోడ్లు లేక సమస్యలు
- నాలుగు వైపులా స్పీడ్ బ్రేకర్లు వేయకపోవడంతో ప్రమాదాలు
- వంతెన నిర్మించి రెండేళ్లవుతున్నా పూర్తి కాని పనులు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రయాణికులు

కాకినాడ లీగల్: నగరంలో రామారావుపేట-కొండయ్యపాలెం ఫ్లైఓవర్ ప్రారంభించి రెండేళ్లు పూర్తయ్యాయి. సమస్యలు మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయి. వంతెనకు అటూ ఇటూ సర్వీస్ రోడ్లు నిర్మించకపోవడంతో స్థానికులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రామారావుపేట-కొండయ్యపాలెం బ్రిడ్జిని మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో నిధులు మంజూరు చేసి, ప్రారంభించారు. ఆయన మరణానంతరం వచ్చిన పాలకులూ పట్టించుకోలేదు. సరైన రోడ్లు లేకపోవడంతో తరచూ ట్రాఫిక్ ఇబ్బందులతో ప్రయాణికులు అవస్థలకు గురయ్యేవారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత బ్రిడ్జి పునర్నిర్మాణం చేసి ప్రారంభించారు. ఈ బ్రిడ్జికి ఇరువైపులా స్థానిక ప్రాంతాలను ఆనుకుని ఉన్న రహదారిని కలుపుతూ రోడ్లు నిర్మించాల్సి ఉంది. ఈ రహదారులు నిర్మించకపోవడంతో చిన్నపాటి వర్షం వస్తే చెరువుల్లా మారుతున్నాయి. దీంతో ద్విచక్ర వాహనాలపై వెళ్లేవారు ప్రమాదాలకు గురవుతున్నారు. వర్షపు నీరు నిల్వ ఉండడంతో ఈ రహదారులు మురికికూపంగా మారుతుండడంతో, స్థానిక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. అలాగే రామారావుపేట-కొండయ్యపాలెం బ్రిడ్జికి కొండయ్యపాలెం వైపు స్పీడ్ బ్రేకర్ ఏర్పాటు చేశారు కానీ, రామారావుపేట వైపు నాలుగు రోడ్లతో ఉన్న జంక్షన్‌లో రెండు మార్గాలకు స్పీడ్ బ్రేకర్లు లేవు. ఈ క్రమంలో వేగంగా వచ్చే వాహనాల వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి బ్రిడ్జికి ఇరువైపులా రోడ్లు ,స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం

వంతెన మలుపుల్లో వ్యాపారాలు చేయడం వలన పాదచారులు, వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. మలుపుల్లో ఉండే వ్యాపారుల వద్ద బైక్‌లు ఆపి కొనుగోలు చేస్తుండడంతో ఆ ప్రాంతంలో ట్రాఫిక్ స్తంభించిపోతోంది. ఆ సమయంలో రోడ్డుపై వెళ్లే వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు.



చిన్నపాటి వర్షానికి అధ్వానంగా మారిన మట్టి రోడ్డు



రామారావుపేట-కొండయ్యపాలెం బ్రిడ్జి



రామారావుపేట-కొండయ్యపాలెం వంతెన పక్కన గతుకులతో మట్టి రోడ్డు

### మట్టి రోడ్డుతో ఇబ్బంది



రామారావుపేట-కొండయ్యపాలెం బ్రిడ్జి ప్రాంతంలో దశాబ్ద కాలంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. బ్రిడ్జి నిర్మాణం ఎట్టకేలకు జరిగినప్పటికీ, బ్రిడ్జికి ఇరువైపులా రోడ్లు నిర్మించకపోవడంతో వర్షాకాలంలో ఇబ్బందులు పడుతున్నాం. మట్టి రహదారిగా ఉన్న ఈ రోడ్డు గోతులమయం కావడంతో వాహన చోదకులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డు నిర్మించాలి.

– జీఎస్ఆర్ కృష్ణారావు, కాకినాడ

### ప్రమాదాలు జరుగుతున్నాయి



రామారావుపేట వైపు దిగే బ్రిడ్జికి రెండు వైపులా స్పీడ్ బ్రేకర్లు వేయాలి. బ్రిడ్జి డౌన్‌లో శివాలయం జంక్షన్ ఉండడంతో వేగంగా వచ్చే వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. వంతెన మలుపుల్లో వ్యాపారాలు చేయడం వలన బైక్‌లు ఆపి కొనుగోలు చేస్తుండడంతో ట్రాఫిక్ పరంగా ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు స్పందించి స్పీడ్ బ్రేకర్లు వేయాలి. బ్రిడ్జికి ఇరువైపులా రోడ్లు నిర్మించాలి.

– బడుగు బాబూ రాజేంద్రప్రసాద్, న్యాయవాది, కాకినాడ

# ప్రమాదాల నివారణపై అవగాహన అవసరం



బైక్ ర్యాలీ ప్రారంభిస్తున్న సత్యనారాయణ తదితరులు

జిల్లా స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ సత్యనారాయణ

కాకినాడ రూరల్: రోడ్డు ప్రమాదాలను నివారించడంలో ప్రజలు చైతన్యవంతులు కావాల్సిన అవసరం ఉందని జిల్లా స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ కేవీవీ సత్యనారాయణ అన్నారు. ప్రపంచ ట్రామా దినాన్ని పురస్కరించుకుని రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా కాకినాడ జిల్లా పోలీస్ శాఖ సహకారంతో మెడికవర్ హాస్పిటల్స్ కాకినాడ బృందం సేఫ్ డ్రైవింగ్‌పై అవగాహన కల్పించడంలో భాగంగా బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని సత్యనారాయణతో పాటు, ఏఆర్ డీఎస్పీ వీజీ శ్రీహరిరావు ఎస్పీ కార్యాలయ ప్రాంగణంలో జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ అరుణ్‌కుమార్ మాట్లాడుతూ, ప్రమాదం తర్వాత గడిచే ప్రతి నిమిషం అమూల్యమన్నారు. గాయాల తీవ్రత తక్కువగా కనిపించినా, అంతర్గత రక్తస్రావం లేదా నరాల గాయాలు ప్రమాదకరం అవుతాయన్నారు. ఎమర్జెన్సీ ఫిజీషియన్ డాక్టర్ ముణికంఠ ప్రసన్నకుమార్ మాట్లాడుతూ, హైవే ప్రమాదాలు క్షణాల్లో ప్రాణాలు తీస్తాయని, కానీ సత్వర చర్యలు ప్రాణాలు కాపాడగలవన్నారు. రోడ్డు ప్రమాదాలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ, గోల్డెన్ అవర్ ప్రాముఖ్యాన్ని వివరించారు. ప్రమాదం తర్వాత మొదటి గంటలో తీసుకునే వేగవంతమైన వైద్య చర్యలు ఎన్నో ప్రాణాలను కాపాడగలవని విశ్లేషించారు. సంస్థ కాకినాడ సెంటర్ హెడ్ శుభాకరరావు మాట్లాడుతూ, ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని విజ్ఞప్తి చేశారు.

# ఉద్యమంలా కోటి సంతకాల సేకరణ

- అన్ని వర్గాల ప్రజలతో సేకరించాలి
- వైఎస్సార్ సీపీ రూరల్ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ కురసాల కన్నబాబు



కోటి సంతకాల సేకరణపై ఈశ్వరరావుకు సూచనలిస్తున్న కన్నబాబు

కాకినాడ రూరల్: మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు చేపడుతున్న కోటి సంతకాల సేకరణ కార్యక్రమం విజయవంతం అయ్యేందుకు అన్ని వర్గాల ప్రజలతో సంతకాలు సేకరించాలని మాజీ మంత్రి, పార్టీ కాకినాడ రూరల్ కో-ఆర్డినేటర్ కురసాల కన్నబాబు పిలుపునిచ్చారు. రమణయ్యపేట వైద్యనగర్ క్యాంప్ కార్యాలయంలో పార్టీ కరప మండల నాయకులతో కోటి సంతకాల సేకరణపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పార్టీ కరప మండల అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కన్నబాబుతో పాటు, కరప జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి తదితరులు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. కన్నబాబు మాట్లాడుతూ, అన్ని వర్గాల ప్రజల నుంచి కోటి సంతకాలు సేకరించాలని, ప్రజల సంతకాలను గవర్నర్‌కు అందజేసేందుకు సంతకాల సేకరణను ఉద్యమంలా చేపడుతున్నామన్నారు. ప్రతి గ్రామం నుంచి భాగస్వామ్యం ఉండాలని, మండల, గ్రామ నాయకులు, కార్యకర్తలు సమన్వయంగా రచ్చబండ కార్యక్రమం నిర్వహించి, సంతకాలు సేకరించాలన్నారు. వచ్చే నెల 22 వరకు కార్యక్రమం జరుగుతుందని, ఈ నెల 28న నియోజకవర్గ స్థాయిలో ర్యాలీ నిర్వహిస్తామన్నారు. 2019-24 మధ్య వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 17 మెడికల్ కళాశాలలను తీసుకువచ్చిందన్నారు. వీటిలో మూడింట అడ్మిషన్లు జరిగాయని, మరో రెండు ప్రారంభోత్సవాలకు సిద్ధంగా, మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయని గుర్తు చేశారు. తాజా కూటమి ప్రభుత్వం పేద, మధ్య తరగతి విద్యార్థులను వైద్య విద్యకు దూరం చేయాలనే దురాలోచనతో వాటిని ప్రైవేట్ పరం చేసేందుకు యత్నిస్తోందన్నారు. ప్రజా మద్దతుతో దీనిని అడ్డుకుంటామని, ప్రభుత్వ దుర్నీతిని సంతకాల ప్రతుల ద్వారా గవర్నర్ దృష్టికి తీసుకువెళతామన్నారు. ప్రభుత్వం అన్ని రంగాలలో విఫలమవుతున్నందున ప్రజల్లో నిత్యం ఉంటూ, వారి సాదకబాధకాలను తెలుసుకుని అండగా ఉండాలని పార్టీ శ్రేణులకు నిర్దేశించారు. కార్యక్రమంలో కాకినాడ రూరల్ జెడ్పీటీసీ సభ్యుడు నురుకుర్తి రామకృష్ణ, పార్టీ నాయకులు పెంకే సత్తిబాబు, కాదా వెంకటేశ్వరరావు, పైల గోవిందు, మద్దూరి భాస్కరరావు, సాదే లోహిదాస్, బండారు వెంకటేశ్వరరావు, బావిశెట్టి సూర్యప్రకాష్, పలివెల నాగేశ్వరరావు, సరిదే నీలిమ, రాజేష్, రొక్కల గణేష్, కమిడి మంగాదేవి, భీమశంకర్, నాగిరెడ్డి ఏసుబాబు, బొమ్మిడి సతీష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సుబ్బారావు

# పట్టు కోల్పోతున్న పత్తి

- సస్యరక్షణ చర్యల్లో సమన్వయం ఉండాలంటూ శాస్త్రవేత్తల సూచన
- ఓ పంట మందులు మరోదానిని దెబ్బ తీస్తున్నాయంటున్న అధికారులు
- పత్తి విత్తనాల నాణ్యతపై తేల్చని వైనం
- అయోమయ పరిస్థితుల్లో రెండు పంటల రైతులు



చేబ్రోలులో దెబ్బతిన్న పత్తి పంట

పిఠాపురం: ఓ పంట బాగుండాలంటే మరో పంట పోయినా మందులు పిచికారీ చేయకండంటూ అధికారులు సూచించడం రైతులను అయోమయానికి గురి చేస్తోంది. ఇటీవల పత్తి పంటలు పూర్తిగా దెబ్బ తినడంతో నకిలీ విత్తనాల వల్లే నష్టపోయామంటూ పత్తి రైతులు ఆందోళనకు దిగారు. దీనిపై పంటలు పరిశీలించిన అధికారులు, శాస్త్రవేత్తలు.. విత్తనాలు నకిలీవా లేక మరేదైనా కారణం ఉందా అనే విషయాలను పరీక్షించి, నిర్ధారిస్తామంటూ శాంపిళ్లు తీసుకెళ్లారు. రెండు రోజుల్లో పత్తి పంట ఎందుకు పోయిందో నిర్ధారిస్తామన్న అధికారులు రెండు వారాలవుతున్నా దానిని పట్టించుకోవడం లేదని రైతులు మండిపడుతున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల పట్టు రైతులకు సమావేశం నిర్వహించిన శాస్త్రవేత్తలు, అధికారులు చేసిన సూచనలు అటు పట్టు, ఇటు పత్తి రైతులను అయోమయానికి గురి చేశాయంటున్నారు. పత్తి పంటలు దెబ్బతినడానికి కారణం నకిలీ విత్తనాలని రైతులు అంటుంటే, దాని సంగతి తేల్చకుండా పంటలు దెబ్బతినడానికి తెగుళ్లు కారణమనే విధంగా అధికారులు సూచనలు చేస్తున్నారు మినహా, విత్తనాలపై అసలు విషయాన్ని తేల్చకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందని రైతులు ఆరోపిస్తున్నారు. మరోవైపు పట్టు పంటలు దెబ్బతినడానికి వాటి పక్కనే ఉన్న పత్తి, ఇతర పంటలకు పిచికారీ చేసే పురుగు మందులే కారణమని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. దీనిపై పత్తి రైతులు, పట్టు రైతులు సమన్వయం పాటించాలంటూ చెబుతున్నారు. పట్టు పంటల పక్కన ఉన్న పత్తి రైతులు పురుగు మందులు పిచికారీ చేసేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలంటూ సూచించారు. ఒక పంటకు కొట్టే మందులు, మరో పంటకు ఎలా చేటు చేస్తుందంటూ రైతులు ప్రశ్నిస్తున్నారు.

ఎటూ తేల్చని అధికారులు..!

కాగా 120 రోజులే పంట కాలం.. అది పూర్తయిన వెంటనే మరో పంట వేసుకోవచ్చు.. అదనపు ఆదాయం వస్తుందంటూ విత్తన కంపెనీలతో పాటు, అధికారులు నమ్మబలకడంతో రైతులు ఆశపడి విత్తనాలు కొనుగోలు చేశారు. తీరా పంట వేశాకా విత్తనాల్లో తేడా ఉందని తెలిసి, పంట పండకుండానే నేల పాలవుతుండడంతో తాము మోసపోయామని భావించిన రైతులు తమకు జరిగిన నష్టాలకు బాధ్యులెవరనే దానిపై నిగ్గు తేల్చాలంటూ రోడ్డెక్కారు. మూడు రోజులుగా ఆందోళన వ్యక్తం చేస్తున్న రైతులు.. ఇటీవల పిఠాపురం పాడా కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల విభాగంలో ఫిర్యాదు చేశారు. నకిలీ విత్తనాలు అమ్మి తమను మోసం చేసిన కంపెనీపైనా, సంబంధిత ఉద్యోగుల పైనా, వాటిని విక్రయించిన దుకాణదారుల పైనా చర్యలు తీసుకుని, తమకు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీనిపై క్షేత్రస్థాయిలో పరిశీలనకు వచ్చిన అధికారులు మాత్రం కేవలం శాంపిళ్లు తీసుకెళ్లడం మినహా, వారాలు గడుస్తున్నా ఎటూ తేల్చడం లేదని రైతులు విమర్శిస్తున్నారు. పంటలు నష్టపోయిన రైతులకు ఎటువంటి భరోసా ఇవ్వకపోవడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### విత్తనాల సంగతీ తేల్చలేదు

వేదా కంపెనీకి చెందిన ప్లాటినం రకానికి చెందిన పత్తి విత్తనాలు ఎకరం భూమిలో సాగు చేశాం. పత్తి కాయలు కాసే దశలో ఎక్కడ మొక్క అక్కడ చనిపోవడం, ఎక్కడైనా పత్తికాయ పగిలితే నల్ల బారి కాయ రాలిపోతోంది. దీంతో తీవ్ర నష్టాల పాలయ్యాం. రెండు ఎకరాలు పత్తి సాగు చేయడం కోసం ప్లాటినం రకం విత్తనాలు స్థానిక సాయికృష్ణ ఏజెన్సీస్‌లో కొన్నాను. పూత, పిందే దశ నుంచి కాయ పగిలేటప్పటికీ, పత్తి మొక్క గిడసబారి గుడ్డి పత్తిలా పగులుతుంది. మొక్క చనిపోతుంది. గతేడాది ఎకరం పత్తి సాగు చేస్తే రూ.50 వేల నుంచి రూ.80 వేల వరకు లాభం. ఇప్పుడు పెట్టుబడి రూ.50 వేలు, శిస్తు రూ.30 వేలు వచ్చే పరిస్థితి లేదు. విత్తనాలమ్మిన దుకాణదారుడు మాకు సంబంధం లేదని చెబుతున్నారు. అధికారులకు ఫిర్యాదు చేస్తే ఇప్పటి వరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. శాంపిళ్లు సేకరించారు మినహా, విత్తనాల సంగతి తేల్చడం లేదు. నష్ట పరిహారం సంగతి అసలు పట్టించుకోవడం లేదు.

– ఓరుగంటి సూర్యచంద్రశేఖర్, పత్తి రైతు, చేబ్రోలు

## కళాశాలలో కలప దొంగలు

- రంగరాయ వైద్య కళాశాల జమేదార్‌పై వేటు
- మరికొందరు సిబ్బందిపై చర్యలకు ఆదేశం

కాకినాడ క్రైం: పనిచేస్తున్న కళాశాలలో చెట్ల కొమ్మలు నరికి, ఆ కలపను అక్రమంగా తరలించి అడ్డంగా బుక్కయ్యారు ఇంటి దొంగలు. వివరాల్లోకి వెళితే, కాకినాడ రంగరాయ వైద్య కళాశాలలో జమేదార్‌గా పనిచేస్తున్న కె.రాజేష్‌కుమార్ కాలేజ్ ఆవరణలో ఉన్న చెట్ల కొమ్మల్ని కొట్టి, వాటి కలపను అక్రమంగా తరలించడంలో కీలక పాత్ర పోషించాడు. ఇందులో అక్కడే పనిచేస్తున్న వారి పాత్ర ఉందని విచారణలో ప్రాథమికంగా నిర్ధారణ అయింది. శానిటేషన్, పెస్ట్ కంట్రోల్‌లో పనిచేస్తున్న మరో ఇద్దరిపై వేటుకు ప్రిన్సిపాల్ డాక్టర్ విష్ణువర్ధన్ సిఫార్సు చేశారు. కళాశాల అడ్మినిస్ట్రేటర్ శ్రీధర్ ఆధ్వర్యంలో బృందం ఈ విచారణ నిర్వహించింది. కలప తరలింపు తంతు కొన్నాళ్లుగా గుట్టుచప్పుడు కాకుండా జరుగుతోందన్న విషయం నిగ్గు తేలింది. దీంతో ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న ప్రిన్సిపాల్ రాజేష్‌కుమార్‌ను సస్పెండ్ చేసి, మిగిలిన బాధ్యులపై తక్షణ చర్యలకు ఆదేశాలిచ్చారు. రంగరాయ వైద్య కళాశాల నుంచి పిఠాపురం, కొవ్వూరుకు రెండు ట్రాక్టర్లతో పాటు, మరో రెండు గూడ్స్ వాహనాల్లో కలప తరలి వెళ్లిందని విచారణలో స్పష్టమైంది. ప్రిన్సిపాల్ అప్రమత్తతతో తరలివెళ్లిన కలప వాహనాలలో రెండింటిని వెనక్కి రప్పించారు. కలెక్టర్ ఆదేశాలతో అటవీ శాఖ ఆధ్వర్యంలో త్వరలో ఈ కలపను వేలం వేయనున్నారు. బాధ్యులపై తదుపరి చర్యల కోసం విచారణ నివేదికను రాష్ట్ర డీఎంఈకి పంపారు.